# తాచెడ్డకోతి

[విపుల మాసపత్రిక]

తాచెడ్డకోతి వనమెల్లా చెరచటం ఖాయం!
వనాలు వదిలి నగరాల్లో ప్రవేశిస్తే
ఇళ్ళుపాడుచేయటమూ జరిగేదే!
అయితే మనిషి ఆలోచనలు
కోతి ఆలోచనలకు భిన్నమైనవా?
ఆలోచించాల్సిందే, మరి!!....

## తాచెడ్డకోతి

"నువ్వు అటునుంచి తరుము....తరిమితే ఇటువైపుకు వస్తుంది" అంటూ అరిచేను. మా పెద్దబ్బాయి పదమూడేళ్ళ వాడు నావైపు భయంగా చూస్తూ అన్నాడు. "మీదకు దూకుతుందేమో .... నాకు భయం!"

"ఏమీ భయంలేదు! నేను ఇక్కడ నుంచి తప్పుకుంటే అదికాస్తా వీధిలోకి పారిపోతుంది....అందుకని నువ్వు అదిలించు! గదిలోకి వెళ్తుంది. వెళ్ళగానే గడియ పెడదాం" అన్నాను.

అంతలోనే వంటింట్లోంచి చక్కా వచ్చింది మా ఆవిడ.

"దాన్ని కట్టడి చేశారంటే మీదపడి రక్కుతుంది. దాని మానాన దాన్ని పోనివ్వండి" అంది విసుగ్గా.

"విజయవాడ పౌరునిగా ఇది నా కనీసధర్మం! స్థానిక ప్రజలే కోతుల పని పట్టాలని పెద్దలంతా అన్నారు. ఏమైనా సరే దాన్ని పోనివ్వను. ఆ కర్రతో దాన్ని కాస్త అదిలించు. గదిలోకి దూరగానే తలుపేద్దాం" అన్నాను నిశ్చయంగా.

మా ఆవిడ నా వంకా, కోతి వంకా చూపులు మార్చి మార్చి చూసింది.

కిటికీ ఊచలు పట్టుకుని కిందకూ, పైకీ ఊగుతూ ఊచల మధ్య నుండి కాళ్ళు దూర్చి ఎలాగయినా బయటకు పారిపోవాలని విశ్వ ప్రయత్నం చేస్తోంది కోతి! ఆ ప్రయత్నం సాగక మధ్యలో పళ్ళు బయటకు పెట్టి గుర్రుమని శబ్దం చేస్తూ భయంకరంగా, వెర్రిగా మా వంక చూస్తోంది. అంతలోనే ఊగుతూ నానా హడావుడీ చేస్తోంది.

"నాన్నా! నాకో మంచి ఆలోచన వస్తోంది...." అంటూ మా అబ్బాయి వంటింట్లోకి పరుగెత్తి కొబ్బరికాయ తెచ్చాడు. "దీన్ని డ్రాయింగురూమ్‌లో పడేద్దాం" తీసుకోటానికి కోతి ఆ గదిలోకి వెళ్ళగానే తలుపేద్దాం" అన్నాడు.

ఆ మాత్రం ఆలోచన నాకు రానందుకు నొచ్చుకున్నాను.

మా ఆవిడ కాయందుకని కోతికి కనబడేలా ఊపి డ్రాయింగు రూములో పడేసింది మెల్లిగా.

అంతే! కీచుమంటూ అరిచి ఒక్క ఉదుటున కిటికి ఊచలు వదిలి డ్రాయింగు రూంలోకి ఒక్క గెంతు గెంతింది కోతి. మెరుపులా పరుగెత్తి నేను బయట గొళ్ళెం వేశాను.

చెమట తువ్వాలుతో ఒత్తుకుంటూ కుర్చీలో కూలబడ్డాను.

మొత్తానికి కోతి చిక్కింది.

మా అబ్బాయి ఆనందానికి అంతేలేదు!

"ఇప్పుడు ఫోన్ నెంబరు 73679కి గాని లేదా 76005కి గాని ఫోన్ చెయ్యాలి" అన్నాను దీర్ఘంగా నిట్టూర్పు విడుస్తూ!

"ఎందుకు?" అంది మా ఆవిడ విసుగ్గానే. అసలీ కోతిని పట్టుకునే ప్రయత్నం మా ఆవిడకి నచ్చినట్టు లేదు.

మా ఆవిడ వంక నిరసనగా చూస్తూ అన్నాను – "పేపర్లో చూడ లేదూ? కోతి కనబడితే దాన్ని గదిలోకి తరిమి గడియ పెట్టి నేను చెప్పిన నెంబర్లున్నాయి కదా, వాటికి ఫోన్ చేయమన్నారు. చేస్తే వాళ్ళొచ్చి కోతిని బంధించి పట్టుకుపోతారట! కోతులను పట్టేవాళ్ళ కోసం పేపరులో ప్రకటనలిచ్చినా ఎవరూ దొరకలేదట! అందుకని పౌరులే కోతులను పట్టుకోటానికి సాయం చెయ్యాలని నగర మేయరు విజ్ఞప్తి చేశారు" అంటూ హుషారుగా లెక్చరిచ్చాను.

"బాగుంది! వెనకటికి ఒక ఊళ్ళో పోలీసులు అన్నారట "దొంగని మీరు గట్టిగా పట్టుకోండి, మేము వచ్చి బేడీలు బిగించి తీసుకువెళ్తాం" అని అలా వుంది ఈ సరసం" అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

మా అబ్బాయి నాకు దగ్గరగా వచ్చి "నాన్నా! మనం ఫోన్ చెయ్య లేమని నా అనుమానం" అన్నాడు.

"ఏం....ఎందుకని?" అడిగేను.

"ఫోన్ డ్రాయింగు రూములోవుంది కదా! కోతి కూడా డ్రాయింగ్ రూంలోనే వుంది. మనం ఫోన్ చేసేటపుడు మీదపడి కరిస్తే...." అన్నాడు.

నాకు మతిపోయినంత పనయింది. నీరసపడిపోయాను.

బయటకు వెళ్ళి ఫోన్ చేద్దామంటే దగ్గర్లో ఎక్కడా ఫోన్‌లు లేవు! కనీసం "బెంజి సెంటరు" వరకూ వెళ్ళాలి. అంటే సుమారు అయిదు ఫర్లాంగులు!

"కోతిని డ్రాయింగు రూంలోంచి నీ బెడ్‌రూంలోకి తరుముదాం నాన్నా! ఈ తలుపులు ఇటూ అటూ మూసి నీ బెడ్‌రూం తలుపులు తెరిచి డ్రాయింగు రూం తలుపులు కూడా తీసేస్తే చాలు! కొంచెం అదిలించామంటే నీ గదిలోకి దూరిపోతుంది" అంటూ మా అబ్బాయి చిన్న పథకం వివరించాడు. అదే మంచిదనిపించింది.

మెల్లగా డ్రాయింగ్ రూం తలుపులు తెరిచాను.

కోతి కనబడలేదు! అంతలోనే కిచకిచమని శబ్దం విన్పించింది. పైకి చూశాను. ఫేను రెక్కల మీద విలాసంగా కూలబడి కొబ్బరికాయ ముక్కలు తింటోంది కోతి.

"ఒక వందరూపాయల కాగితం నేలమీద పడేద్దాం! డబ్బుచూస్తే కొండమీద కోతయినా దిగివస్తుందంటారు. ఫేనుమీది కోతి దిగిరాదా?" అన్నాడు మా అబ్బాయి. ఈ మధ్య చందమామకీ, బాలమిత్రకీ కథలు రాయటం ఆరంభించినప్పటి నుండీ వాడి మాటలధోరణి ఇలాగే సాగుతోంది.

"నువ్వు బోడిసలహాలు ఇవ్వటం మానేసి, మరో కొబ్బరికాయ తెచ్చి నా బెడ్‌రూంలో పడెయ్" అన్నాను.

మా వాడు మరో కాయతెచ్చి దానికి చూపించి నా బెడ్‌రూంలోకి

గిరాటేశాడు. అయినా కోతి దిగిరాలేదు. "ఇస్సు, అస్సు" మంటూ చాలా సేపు అదిలించాను. ఫలితం లేకపోయింది. అప్పుడు మెరుపులా నాకో ఆలోచన వచ్చింది. మెల్లగా డ్రాయింగ్‌రూంలోకి అడుగుపెట్టి ఫేను స్విచ్ వేశాను. ఫేను తిరగటం ఆరంభించింది. కోతి గాభరాపడుతూ రెక్కలమీద ఇటూ అటూ గెంతుతూ కొంచెంసేపు కిందా మీదా పడింది అంతలోనే గభీమని తోసేసినట్లు వెళ్ళి గదిలో టేబులుమీద వున్న "అక్వేరియం" మీద మూటలాపడింది. భళ్లుమనే శబ్దంతో అక్వేరియం తిరగబడి గాజు అద్దాలన్నీ పప్పులా అయిపోయాయి. గదినిండా నీళ్ళే! చేపపిల్లలన్నీ తూలిపోయాయి. అంతలోనే రివ్వున రాకెట్‌లా నా పక్క నుండి ఏదో వెళ్ళినట్లయింది. మా అబ్బాయి కెవ్వున అరిచాడు! కోతి ఒక్క ఉదుటున నా బెడ్‌రూంలోకి గెంతింది. ఈ భీభత్స దృశ్యమంతా సెకన్లలో జరిగిపోయింది. నేను తేరుకునే సరికి మా అబ్బాయి మెరుపులా ముందుకు దూకి వెళ్ళి బెడ్‌రూం బయట తలుపుకు గొళ్ళెం పెట్టేడు.

అంతలోనే అక్కడకు వచ్చిన మా ఆవిడ పగిలిపోయిన అక్వేరియంను చూసి నెత్తీ నోరూ బాదుకుంటూ "నా గోల్డ్‌ఫిష్‌లన్నీ చచ్చిపోయాయి బాబోయ్" అంటూ అరుపులు ప్రారంభించిం.

"నువ్వు నోర్మూయ్!" అంటూ మా ఆవిడమీద అరిచి మా అబ్బాయి సమయస్ఫూర్తికి మెచ్చుకున్నాను.

మొత్తానికి కోతి చిక్కింది!

డ్రాయింగ్ రూంలోకి వెళ్ళి ఫోన్ తీసి 76005 కి ఫోన్ చేశాను.

"హల్లో.... నేను వడమటలంక నుండి మాట్లాడుతున్నాను. కోతి దొరికింది. గదిలో వుంచాం. మీరు వెంటనే అన్నీ పట్టుకుని రండి" అన్నాను ఒగర్చుతూ.

"ఓకే.... వస్తున్నాం! టేపురికార్డరును పట్టుకొని మా ప్రొడక్షన్

అసిస్టెంటు మీ ఇంటికి వస్తాడు. చిరునామా చెప్పండి. గిరిజన ప్రత్యేక కార్యక్రమంలో ప్రసారంచేస్తే వెరయిటీగా వుంటుంది. ఇంతకీ ఆ కోతికి మాటలు ఏమయినా వచ్చునా?" అంది అవతలి కంఠం ఆసక్తిగా.

నాకంతా అయోమయంగా వుంది.

"ఏపురికార్డరా.... అదెందుకు?" అంటూ అరిచేను.

"ఇంటర్వ్యూ కింద రికార్డు చేద్దాం. కోతితో మీ అనుభవాలు వివరించండి. వీలయితే కోతి కిచకిచలుకూడా బ్యాక్ గ్రౌండులో రికార్డు చేస్తే నేచురల్‌గా వుంటుంది ఇంటర్వ్యూ" అంది అవతలి కంఠం.

నాకు మతిపోతోంది.

"అది మున్సిపల్ కార్పొరేషను ఆఫీసేనా?" అడిగేను.

"కాదు. ఆకాశవాణి"

టపీమని రిసీవరు పడేశాను. విజయవాడ టెలిఫోన్ డిపార్టుమెంటుని తిట్టుకుంటూ ఈసారి 73679 డయల్‌చేశాను.

"అయ్యా! మీరు కోరిన విధంగా కోతిని బంధించాం! మీరొస్తారా?" అన్నాను.

అవతలి వ్యక్తి కంఠం బొంగురుగా వుంది. "వెరీగుడ్! మొదటి కోతిని బంధించటానికి సహాయపడిన కీర్తి మీకే దక్కుతుంది. నగర మేయరుగారి అధ్యక్షతన సన్మానంచేసి 'కోతి బంధిత' అవార్డు మీకు ఇస్తారు. మీ చిరునామా వివరంగా చెప్పండి. మావాళ్ళని వెంటనే జీపులో పంపిస్తాం" అన్నాడాయన ఉద్వేగంతో.

నా చిరునామా వివరంగాచెప్పి ఫోన్ పెట్టేశాను.

ఆనందంతో మా అబ్బాయివంక చూసేను.

నాకు జరగబోయే సన్మానం తలుచుకుంటే ఒడలు పులకరించి పోతోంది. గర్వంగా మా ఆవిడతో సన్మానం సంగతి చెప్పేను.

"సన్మానం మాటకేంగాని బంగారంలాంటి అక్వేరియం పగిలిపోయింది" అంటూ గునిసింది.

పావుగంటలో కార్పొరేషను జీపు మా ఇంటిముందు ఆగింది. అందులోంచి ఇద్దరు మరమనుషుల్లాంటివాళ్ళు దిగేరు. ఒళ్ళంతా కవచంతో కప్పేసుకుని ముఖానికి ప్లాస్టిక్ షీల్డు తగిలించుకోవటంవల్ల వాళ్ళు చంద్రమండల యాత్రికుల్లా వున్నారు.

"కోతి వున్న ఇల్లు ఇదేనా?" అని అడిగేరు.

"ఇదే!" అంటూ వాళ్ళకు బెడ్‌రూం వైపు చూపించాను. వాళ్ళ చేతుల్లో ఒక గోనెసంచీ మూట వుంది. అందులోంచి ఒక పాత వల బయటకు లాగేరు.

"ఇది నాలుగో కేసు! ఇప్పటికి ఈ వారంలో ముగ్గురు ఫోన్‌చేశారు. కోతి మా మీదపడి రక్కేయ్యకుండా ఈ సూటు వేసుకుని వలతో పట్టాలని ప్రయత్నించాం. ప్రతిసారీ కోతులు తప్పించుకుపోతున్నాయి. ఈసారి ఎలాగైనా పట్టుకుని తీరుతాం" అన్నాడు అందులో ఒకడు.

"తలుపు గడియతీసి భళ్ళున తెరచి మీరు పక్కకు తప్పుకోండి. మేం ఈ వల కోతిమీదకు విసురుతాం. తరువాత తాడు బిగించితే మరి కదల్లేదు" అన్నాడు రెండోవాడు.

మా అబ్బాయిని లోపలకు వెళ్ళమని పంపించేశాను.

వాళ్ళిద్దరూ వలతో రెడీ అవగానే భళ్ళున తలుపు తెరిచి పక్కకు తప్పుకున్నాను. కోతి మంచంమీద కూర్చుని వుంది.

వాళ్ళిద్దరూ వల విసరటం, దబ్బున చప్పుడు కావటం, కీచుమని అరవటం, తుప్పున కోతి గదిలోంచి ఇవతలకు దూకి మరోదూకులో రోడ్డుమీదకు పోవటం, తరువాత కంటికి కనబడకపోవటం- ఇవన్నీ క్షణాల్లో జరిగిపోయాయి.

కళ్ళముందు మెరుపు మెరిసి మాయమయినట్లు జరిగిపోయింది.

ఇదంతా! మా అబ్బాయి ఇంట్లోంచి వచ్చి నావంకా, కార్పొరేషన్ మనుషుల వంకా, వాళ్లు విసిరిన వల వంకా మార్చి మార్చి చూసేడు రెండు నిమిషాలు! మేం ముగ్గురం స్థాణువుల్లా వుండిపోయాం.

"కోతి పారిపోయిందా?" అని అడిగేడు మా అబ్బాయి మా ముఖాల్లోని దైన్యం గమనించి.

"పారిపోయింది" అన్నాను నిట్టూరుస్తూ.

"పారిపోతుంది! ఎందుకంటే వలకి వున్న కన్నాల్లోంచి కోతులే కావు, ఏనుగులు కూడా దూరిపోతాయి" అన్నాడు మావాడు వలకివున్న పెద్దపెద్ద కన్నాలవంక చూపిస్తూ.

కార్పొరేషను వాళ్ళిద్దరూ ముఖముఖాలు చూసుకున్నారు.

"హారినీ! అందుకే కోతులు తప్పించుకుంటున్నాయన్నమాట! ఇంత వరకూ గమనించనేలేదు. దీన్నిండా కన్నాలే! ఫండ్సులేవని పాతవలలే ఎలాగో అలాగ వాడమంటున్నారు. ఏం చేస్తాం? సరే.... మేం వెళ్ళి వస్తాం" అంటూ వల మడతపెట్టి సంచిలో కూరి జీపు దగ్గరకు వెళ్ళిపోయారు.

నేను నీరసంగా బెడ్‌రూంలోకి అడుగు పెట్టేను.

కాళ్ళకి ఏవో వస్తువులు గుచ్చుకుంటే చూశాను. రేడియో వాల్వులు నేలమీద చిందరవందరగా వున్నాయి! గడియారం ఒక మూల పగలగొట్టబడివుంది!! మంచంమీది డన్‌లప్ పరుపునిండా కన్నాలుపడి స్పాంజ్ బయటకు తొంగి చూస్తోంది!!! చీరలు పీలికల్లా ఇటూ అటూ పడేసి వున్నాయి!!! హతాశుణ్ణయి నేలమీద కూలబడిపోయాను.